కొండయ్య

కొండయ్య బరువు రెండువందల పౌనులు. ఇక ఆ మనిషి ఎంత లావో ఊహించుకోండి. కొండయ్య నిజంగా ఒక చిన్న కొండే! ఎవరిపై ఎఱ్ఱబారిన నేమి ప్రయోజనము.

ఆయన నడుస్తూఉంటే ఒక చిన్న పర్వతం కదులుతూ ఉన్నట్లుగా ఉంటుంది. ఆయన కాళ్ళక్రింద భూమి క్రుంగి పోతూ ఉంటుంది.

కొండయ్య భాగ్యవంతుడు కావలసినంత డబ్బుఉన్నది. తోడబుట్టినవాళ్ళు ఆయన కెవరూ లేరు. ఆయనా, ఆయన తల్లీ ఉంటున్నారు.

ఒక పెద్ద భవనంలో కొండయ్య కాపురము. ఆఇంట్లోన విశాలమైన గదులు ఎన్నో ఉన్నవి. కొండయ్య మేడపైన రెండు గదులు తనకోసం అట్టి పెట్టుకొన్నాడు. ఆతడు ప్రాప్త వ్యవహారుడు అయినకారణాన ఎందరో ఆయన దగ్గరకు వచ్చి పోతూ ఉండేవారు.

మేడపై నున్న రెండు గదులలో ఒకటి ఎవరైన వచ్చినపుడు కూర్చుండేందుకు ఏర్పడినది. ఆ గదికి అటూ ఇటూ ఉన్న ద్వారబంధాలు అంత విశాలమైనవిగా ఎందుకుఉన్నవో మనము సులభముగా ఊహించుకోవచ్చును.

దాని ప్రక్కనే ఉన్న రెండవగది అంతకంటే విశాలమైనది. అది కొండయ్యగారి పడకగది. ఆ గది గోడలపై

చిత్ర విచిత్రములైన పటములున్నాయి. అందు అలమారలలో రకరకాల పుస్తకము లున్నాయి.

కొండయ్య ప్రాప్తయౌవనుడైనా ఇంకా వివాహము చేసికొనలేదు. ఆయన చేసికొనక పోవుటకాదు. ఆయనకు పిల్లను ఎవ్వరూ ఇయ్యలేరు. తల్లే వండి పెడుతున్నది. అతనికి సేవ చేయుడానికి సేవకులు కావలసినంతమంది ఉన్నారు.

కొండయ్యకు డబ్బు సంపాదించవలసిన అవసరము లేదు. పెద్దలు సంపాదించి ఇచ్చిపోయిన ఆ స్తిబోలెడుఉన్నది. అందుచేతనే కొండయ్య ఎక్కువగా విద్యావ్యాసంగంలో కాలం గడుపుతూ ఉండేవాడు. అప్పుడప్పుడు స్నేహితులతో హాస్య ప్రసంగాలు చేస్తూ సుఖంగానే జీవిస్తున్నాడు.

కాని కొండయ్య నిర్లిప్తుడై ఆనందంగా కాలం గడుపుతున్నాడు అంటానికి వీలులేదు. భృత్యులకు లోటులేదు. భృతికి లోటులేదు. విలాసములకు కొదువలేదు. కాని ఆయనకు ఒంటిరి జీవితము దుర్భరము అనిపించినది. అందరివలెనే తాను పెండ్లిచేసికొని పిల్లలను గని సుఖంగా ఉండాలని ఆతని కోరిక. కాని ఎవరూ ఆయనకు పిల్లను ఇయ్యడానికి ఒప్పుకోలేదు.

అయ్యబాబో అతడు మనిషిలాగ ఉండడు. విపరీతమైన లావు! మాంసపు కండరములు ఒకదానిపై నొకటి పేర్చగా ఏర్పడినది ఆతని శరీరము. కొన్ని కండరములు వ్రేలాడుతూ ఉంటవి. అతడొక రా క్ష సు డు. కాలు కదపలేని స్థూల కాయుడు.

అతని కాయకస్థౌల్య మాతనికొక వికృతరూపమును తెచ్చిపెట్టింది.

దానికితోడు కొండయ్య కన్నులు రక్తోత్పలములవలె పెద్దగాను భయంకరముగాను ఉండేవి. అట్టి వికృత రూపికి ఎవరు పిల్లనిస్తారు!

ఈ శరీరం తగ్గి తేలిక అయిపోతే ఎంత బాగుండును!

కానూ అందరిలాగే నడుస్తూ తేలికగా అటు ఇటూ తిరుగగలిగితే ఎంత బాగుంటుంది! అని అనుకొనేవాడు కొండయ్య.

ఏ భగవంతునికైనా దయ వచ్చి తనను మాములు మనిషిగా చేస్తే బాగుండునని వేయి దేవుళ్ళకు మొక్కుకొనేవాడు కొండయ్య.

కాని ఏ దేవుడికీ దయరాలేదు. పరమేశ్వరుని కరుణా కటాక్ష వీక్షణానికై కొండయ్య పరితపించిపోయినాడు. ఉపవాసములు చేసినాడు. కాని అతని శరీరము తులమైనను తగ్గలేదు. అంగుళమైనను జంకలేదు.

ఔషధ సేవవలన ఏమైనను లాభించక పోతుందా అని అతనికి తోచినది. ఎంతమందినో అటువంటి మందు ఏదైనా ఉంటే చెప్పమని ప్రార్థించినాడు. కాని ఈ విషయములో ఎవ్వరుగాని ఆతనికి ఏవిధమైన సాయమును చేయలేక పోయినారు. మందు మాకులవలన తటమటయేగాని తక్కువపడుట జరుగలేదు. తగ్గుదలలేదు తగులుబడి మితిమీరినది.

పత్రికలలోని ప్రకటనలను కొండయ్య జాగ్రత్తగా పరిశీలించి, ఆ మందులేమైనా పనిజేస్తాయేమోనని ఆశపడ్డాడు

అవి ఏమీ పనిచేయలేదు. అతనికి విచారం ఎక్కువఅయింది.
జీవితము దుఃఖభాజనము అయిపోయింది ఏమి చేయడానికీ
పాలుపోలేదు.

ఈ స్థితిలో అతనికీ నాకూ పరిచయం ఏర్పడ్డది. ఒక
రోజున కొండయ్య తన దీనావస్థ అంతా నాతో చెప్పుకొని
కళ్ళనీళ్ళు పెట్టుకొన్నాడు

'ఈ మాత్రానికి నీవు ఎందుకయ్యా ఇంత దుఃఖ
పడతావు? సూలకాయము ఉన్నంతమాత్రాన నీకు వచ్చిన
నష్టం ఏముంది? నీవు కష్టపడి పనిచేయవలసిన అవసరంగాని,
డబ్బు సంపాదించవలసిన అగత్యంగాని లేదుగదా! అని ఎంత
చెప్పినా ఆయన ఊరట చెందక, ఎల్లాగయినా ఈ స్థౌల్యం
పోయే ఉపాయం చెప్పమని ఎంతో ప్రాధేయపడ్డాడు.

నాకు చాలా జాలివేసింది. ఆయనకు ఏవిధంగా సాయ
పడదామా అని ఆలోచించినాను.

మా మేనత్త ఒక ఆమె మలయాళ దేశస్థుని వివాహ
మాడి, ఆ దేశంలో నలభై సంవత్సరాలు కాపురంచేసింది.
ఎన్నో మంత్రాలూ, మందులూ ఆమె సంపాదించినది భర్త
చనిపోయిన తరువాత ఆమె తిరిగి మన దేశం వచ్చి కొంత
కాలం జీవించి, వృద్ధురాలై చనిపోయింది. ఆమె తాను
నేర్చిన తంత్రాలు, మంత్రాలూ, అన్నీ ఒక పుస్తకంలో
వ్రాసి ఉంచినది. తాను సంపాదించిన మందులనుగురించికూడా
ఆమె వ్రాసి పెట్టుకొన్నది.

ఆ కాగితాలు చూస్తే కొండయ్య లావు తగ్గించే
టందుకు ఏదైనామందుదొరకవచ్చునని నాకుఅప్పుడుతోచినది.

కాని ఆ మందులవలన సత్ఫలితాలు రానూ వచ్చును. రాకపోనూవచ్చు ఇదమిద్ధమని ఏమీ చెప్పలేము.

ఆ మందులు తయారుచేయడంలో ఏదైనా లోపం జరిగితే అవి వికటించి అపకారం చేసినా చేయవచ్చు.

కాని ఆయన దీనావస్థ, ఆతని ఔత్కంఠ్యము చూచి నేను జాలిపడ్డాను. అందుచేత ఆ విషయమున జాగ్రత్తలు విచారిస్తూ కూర్చోనక, వెంటనే. "సరే, ప్రయత్నిస్తాను" అన్నాను.

"కొండయ్యా, మా మేనత్త వ్రాసిపెట్టిన ప్రక్రియలు నీకు ఏమైనాపనికొస్తవేమో చూస్తాను. లావు తగ్గి నాశరీరము తేలిక కావడానికి ఏదైనా మంత్రమో మందో దొరకవచ్చు" అన్నాను

ఆయన చాలా సంతోషించినాడు.

'కాని అవి ఎప్పుడూ మంచి పని చేస్తవిఅని అనుకొంటానికి వీలులేదు. ఆ మందులు బహు జాగ్రత్తగా తయారు చేయువలెను. అందులో వ్రాసిపెట్టినరీతిగా మూలికలన్నీ సమకూర్చి ఆయా పాళ్ళలో కలిపి పుటంబెట్టి చూర్ణం చేయవలె. ఎక్కడ ఏ పొరపాటుజరిగినా కొంపమీదికి వస్తుంది. ఆమందులకు విరుగుడు మన ఆయుర్వేద వైద్యులు ఇయ్యలేరు.ఏదైతే అది అవుతుందని మొండి ధైర్యంతో పుచ్చుకొంటేపుచ్చుకో. లాభించనూవచ్చు. లాభించకపోనూ వచ్చు నీవే ఆలోచించుకో. కావలిస్తే ఆ కాగితాలన్నీ వెదకి నీకు కావలసిన ప్రక్రియ ఏమైనాఉందేమో చూస్తాను"అని కూడా చెప్పినాను.

కొండయ్య ఒక్కక్షణం ఆలోచించినాడు. చివరకు అన్నాడు. 'ఈ బరువును ఈడుస్తూ బ్రతికేకంటే మరణమే వాంఛనీయము అనిపిస్తుంది. ఏదైతే అది అవుతుంది. ఈ కాయిక వైకృతిని నేను సహించలేను. ఆ పుస్తకంలో దీనికి ఏమైనా మందు ఉందేమోచూడు'' అని నన్ను ఎంతో బతిమిలాడినాడు.

'సరే' నని చెప్పివచ్చివేశాను.

2

పది పదిహేను రోజులు ఏకదీక్షగా వెదకిన తరువాత మొక్కలు, మదుసునూరి మట్టిచెయ్యగా తయారయ్యే ఒక ప్రక్రియ కనిపించినది. 'వారంరోజులు ఆ చూర్ణం సేవిస్తే, మనిషి బరువును కోల్పోయి తేలిక అవుతాడు' అని వ్రాసి ఉన్నది.

అది తీసికొని వెళ్ళి కొండయ్యకిచ్చి ''అబ్బాయీ, ఇది ఒక్కటే కనిపించింది. ఇది మనిషి తేలికకావడానికి మందుట! నీకు కావలసినది లావుతగ్గటము కాని తేలిక కావడము కాదు. ఈ తేలికకావడము అంటే ఏమిటో ఏమవుతావో నాకు సరిగ్గా తెలియడములేదు. దీనివలన ఏమికొంప మునుగుతుందో నేను చెప్పలేను. ఆలోచించుకొని నీయిష్టంవచ్చినట్లు చెయ్యి.

ఎగుడుదిగుడు అయితే నన్నేమీ అనకూడదు'' అని స్పష్టంగా చెప్పి, మరీ యిచ్చాను.

ఈ శరీరాన్ని మోయలేక చస్తున్నాను. తేలికఅయితే అదీ ఒక లాభమే. శరీరం తగ్గనిదే తేలిక కావడము ఎల్లా సంభవమూ ! ఆ విషయము వ్రాయకపోయినా శరీరము తగ్గి తేలిక అవుతుందనే దాని అర్థము. మనము తర్జనభర్జన చేయ వద్దు. మీన మేషాలు లెక్కపెడుతూ కూర్చుంటే కాదు. నేనేమీ భయపడను ఏదైతే అది అవుతుంది' అంటూ ఆ కాగితాన్ని ఆయన తీసికొని డ్రాయరులో పెట్టుకొన్నాడు.

కాసేపు అయినతరువాత కొండయ్య అన్నాడు. ''రెండు రోజులలో మందు తయారు చేయిస్తాను. నీవుమటుకు ప్రతిరోజూ సాయింత్రం ఒకసారి ఇటు వచ్చి చూచి వెళ్ళుతూ వుండు. నా శరీరము తగ్గి మీ అందరిమోస్తరు మామూలు మనిషిని అయినానో, పెళ్ళి చేసుకొని సుఖపడతాను. లేదా ప్రాణాలు విడవడానికి కూడా వెనుదీయను'

ఆ తరువాత రెండు రోజులలో మందు తయారు అయింది. మంచి ఘనవైద్యుల సాహాయ్యం తీసికొని, ఎన్ని మూలికలు కలపవలయునో అన్నీ కలిపి ఏలోపము రాకుండా ఔషధము తయారుచేయించినాడు.

కొండయ్య మందు పుచ్చుకోవడం ప్రారంభంచేసి నాడు మంచిరోజు చూచి.

నాలుగో రోజునకే ఆతనికి గుణము కనుపించసాగినది. ఏదో ఒడలు తేలికఅయినట్లు తోచింది. గాలిలో తేలిపో తున్నట్లు అనిపించింది అతనికి.

కొండయ్య అమితమైన ఆనందం పొందసాగినాడు. ఆయన నడుస్తూఉంటే కాళ్ళు తేలిపోసాగినవి. పూర్వము అతనికి అడుగు తీసి అడుగు వేయడమే కష్టం అనిపించేది. ఇప్పుడు అతడు తేలికగా పరుగెత్తగలుగుతున్నాడు

ఈ స్థితి కొండయ్యకు ఎంతో హాయి అనిపించింది "శరీరంకూడా తగ్గిపోతుంది తాను మామూలు మనిషి అయి పోతాడు. అప్పుడు ఎవరు బడితే వాళ్ళే పిల్లనిస్తారు తన కేం తక్కువ !" ఈ ఆలోచనలు వచ్చి అతడు ఆనందంతో ఊగి పోయినాడు.

ఆ తరువాత ఆతనికి ఎన్నో మధురాతి మధురమైన ఆలోచనలు వస్తూఉండేవి. తనకు ఇల్లు వాకిలీ, ధనం, ధాన్యం అన్నీఉన్నవి ఈదేహసంబంధమైన స్థౌల్యంపోతేతనకు వివాహం కాక ఏం జేస్తుంది ! తప్పక అవుతుంది. ఎవరో ఒకరు పిల్లను ఇస్తారు. తనకు సంతానంకూడా కలుగుతుంది. తన తల్లి ఎంత సంతోషిస్తుందో మనుమలను మనుమరాండ్రనూ చూచుకొని. ఇల్లాంటి మధురమైన ఊహాలలో అతడు ఉబ్బితబ్బిబ్బైపోయి నాడు. ఆతనికి ఒడలు గగుర్పాటు కలిగింది.

ఆ రాత్రి ఆయనకు ఎప్పుడు నిద్ర పట్టిందో ఆయనకే తెలియదు. ఆ రాత్రిఅంతా ఆయన మధుర స్వప్నాలుకంటూ గాలిలో తేలిపోయి, నందనవనంలో విహారంచేసినాడు.

3

ఆ మరునాడు ఉదయానే, ఇంకా నేను నిద్ర లేవక పూర్వమే ఎవరో తలుపు తట్టి గోలగాపిలవడము వినిపించింది.

మా ఆవిడ తలుపు తీసి 'ఎవరబ్బాయి! ఎవరికోసం? ఎందుకొచ్చావు? అని అడుగుతూ ఉండడముకూడా విని పించినవి.

ఆ వచ్చిన కుఱ్ఱవాడు, రొప్పుకుంటూ రోజుకుంటూ, 'అయ్యగారిని ఉన్నపాటున రమ్మన్నారండి కొండయ్యగారు. కొంప మునిగిందని చెప్పమన్నారండి' అంటున్నాడు.

నిద్రమత్తులో ఉన్నా నాకు ఆ మాటలు స్పష్టంగా వినిపించినవి. నేను లేచి గుమ్మంలోకి వెళ్ళి 'ఏమిటయ్యా గొడవ, ఏమి జరిగింది' అన్నాను.

'ఏమి జరిగిందో తెలియదండి. అయ్యగారు గదిలో నుంచి బయటికి రావడము మానేశారండి! లోపల గడియ వేసుకొని కూర్చున్నారు' అని ఆ కుఱ్ఱవాడు చెప్పేసరికి నాకు ఎంతో ఆశ్చర్యము కలిగింది.

'లోపల ఏమి చేస్తున్నారురా?' అని అడిగినాను ఎంతో ఆదుర్దాగా.

'ఏం చేస్తున్నారో తెలియదండి. ప్రొద్దున కాఫీకికూడా రాలేదు. ముసలమ్మగారు పిలిచినా, 'నేను రాను, నన్ను

మాట్లాడించబోకండి' అని విసుగ్గున్నారు. ఏవో విచిత్రమైన ధ్వనులు వినవస్తున్నవి. బాబూ తలుపు తియ్యండి అన్నాను నేను. అంటే ఆయన తలుపు తీయడానికి వీల్లేదు. నీవు వెళ్ళి పంతులుగారిని తీసుకురా. ఇక్కడున్నట్లు రమ్మను. కొంప మునిగి పోయిందని చెప్పు' అన్నారండి అన్నాడు.

వాడి మొఖం చూచినా, వాడు చెప్పేపద్ధతి చూచినా ఏదో భయంకరమైన విపత్తు సంభవించి ఉంటుందని తోచింది.

ఇంతలో మా ఆవిడ అందుకొన్నది. ఆవిడకూ తోచింది కొండయ్యా ఏదో ఆపదలోనే ఉన్నట్లు. 'ఉన్నవారు ఉన్నట్లు ఉండరాయె మీరు! ఆ మందు ఏదో ఇస్తిరి! పాపం ఏమి జరిగిందో! ఏదో నెత్తిమీదకురాబట్టే ఆయన అల్లాగ కబురు చేసినాడు. తొందరగా ముఖంకడుక్కోవడమూ అదీ కానిచ్చి ఆయన దగ్గరకు పరుగెత్తండి' అని గోల పెట్టింది ముఖ ప్రక్షాళనాది కార్యములు తొందర తొందరగాముగించి నేనూ పరుగెత్తుకొని వెళ్ళాను.

4

నేను వెళ్ళేటప్పటికి, అంతా గందరగోళంగా ఉన్నది. తల్లి ఏడుస్తూ కూర్చున్నది. పనివాళ్ళు అటూ ఇటూ పరుగెత్తుతున్నారు. ఎవ్వరికీ స్థిమితంలేదు. ఏమిట్రా సంగతి అంటే ఎవ్వరూ చెప్పరు. చెప్పడానికి ఎవ్వరికీ అసలు ఏమి జరిగిందో

తెలియదు. 'అయ్యగారు లోపల తలుపు వేసుకొని కూర్చు న్నాడు. తలుపు తీయమంటే తియ్యరు' ఈ ఒక్కమాటే ఎవరు చెప్పినా !

నేను యకాయకీని మేడపైకి వెళ్ళి ఆయన గది తలుపు తట్టినాను. 'కొండయ్యా ఏమిటయ్యా సంగతి ?' అని గట్టిగా అరిచినాను.

దానికి సమాధానం వెంటనే రాలేదు. లోపల ఎవరో మెల్లగా ఏడుస్తూ ఉన్నట్లు వినిపించినది.

'ఏమీ ఫరవాలేదు. భయపడకు. ముందు తలుపు తియ్యి' అని కేకవేసినాను.

'ఎట్లాగు రావడము ? అయినా ఉండుండు' అని కొండయ్య లోపలనించి సమాధానము చెప్పినాడు.

కాసేపటికి లోపలి గొళ్ళెం తీసినట్లు శబ్దం అయింది. కాని ఎవరూ తలుపు తెరువలేదు. నేనే తలుపు నెట్టుకొని లోపలికి పోయినాను.

గదిలో ఎవ్వరూ లేరు ! కొండయ్య ఏమైపోయినట్లు ! ఎక్కడో సన్నని మూల్గుమాత్రం వినిపిస్తున్నది. 'కొండయ్యా!' అని పిలిచినాను. 'ఆఁ ఆఁ' అని పలికినాడు. ఆ శబ్దం పైనుంచి వచ్చింది. తల ఎత్తి చూశాను.

కొండయ్య ఎక్కడున్నాడో చూసేసరికి నాకే ఆశ్చర్యం కలిగింది ! భయం వేసింది.

ఆయన డాబాకప్పును అతుక్కొని ఉన్నాడు బల్లిలాగ !

బెలూనును ఎగురవేస్తే అది ఎగిరి పోయి ఎల్లాగయితే కప్పును అతుక్కుని ఉంటుందో అల్లాగే ఉన్నాడు కొండయ్య ఆ పైకప్పు అల్లాగ అడ్డం కాబట్టి బ్రతికి పోయినాడు కాని లేకపోతే అంతరిక్షంలోకి ఎగిరిపోయేవాడు అన్నమాట!

'ఏమిటయ్యా కొండయ్యా, ఇది?'

కొండయ్య ఆ ప్రశ్నకు జవాబు ఏమీ చెప్పక నెత్తి, నెత్తి బాదుకున్నాడు. కంట నీరు పెట్టుకున్నాడు

కొండయ్య ఉన్న స్థితి మొదట నాకు భయం వేసింది. గుండెలు దడదడ కొట్టుకున్నవి. ఏమీ తోచలేదు. మనుష్య ప్రవర్తన కాదది. నా కళ్ళు నేనే నమ్మలేకపోయినాను. పైకి ఎట్లా ఎగిరిపోయినాడు! అక్కడ ఏ ఆధారం లేకుండా ఎల్లాగ ఉన్నాడు! అంతా అగమ్యగోచరంగా ఉన్నది.

దయ్యం పట్టినవాళ్ళు ఇల్లాంటి అతి మానుషమైన పనులు చేస్తూ ఉంటారని ఎవరో చెప్పగా విన్నాను. ఈయనకే దయ్యం పట్టి ఉంటుంది! ఎటూ పాలుపోలేదు. నిర్ఘాంత పడినట్లు నిలువబడ్డవాణ్ణి, నిలువబడే ఉన్నాను.

కొంతసేపటికి 'ఏమిటిది?' అని మళ్ళీ అడిగితే ఆయన ఏమీ సమాధానం చెప్పలేక నెత్తి బాదుకొని జుట్టు పీక్కుని ఏడ్వడం సాగించినాడు.

నేను ఏదో ధైర్యం చెప్పవలె ఆయనకు. ఎల్లాగో ఓదార్చవలె. లేకపోతే ఆయన గతి ఏమైనట్లు!

ఇల్లాగ అనుకొనేసరికి, నాకు మొదట్లో కలిగిన భయం పోయింది. ఆయనగారి స్థితిని జూస్తే నవ్వు వచ్చింది.

అప్పటికి కొండయ్యకూడా దుఃఖపు పొంగును అదుపు లోనికి తెచ్చుకొన్నాడు.

'ఏమిటిది ?'

'తేలిక అయి ఇట్లా అయినాను'.

'ఎప్పటి నుండి ఈ స్థితి '?

'నిన్న రాత్రి అర్ధరాత్రి ఇక్కడకు వచ్చేశాను. తిండీ తిప్పలూ లేవు... ఏదైనా ఉపాయం ఆలోచించు' అని మళ్ళీ ఏడ్వడము సాగించినాడు.

నేను కుర్చీలో కూలబడి దీర్ఘంగా ఆలోచించినాను ఏమిటా ఉపాయమని ! ముందు ఆయనగారిని ఎట్లాగో క్రిందికి లాగి కాస్త ఏదైనా తినిపించడము అవసరమని తోచింది. మనిషి వడిలి తోటకూర కాడ అయిపోయినాడు.

'క్రిందికి రాలేవా ?' అని అడిగినాను

'ఎట్లా వచ్చేది. గాలికంటే తేలిక అయిపోయినాను. కప్పు అడ్డం లేకపోతే ఇంకా పైకి ఎగిరిపోయేవాణ్ణేమో అను కుంటాను!'

'ఏమి కర్మ వచ్చిందయ్యా కొండయ్యా !'

'ఆ మందు తింటే మనిషి తేలికఅవుతాడని మీ అత్త వ్రాసిపెట్టినా, ఇంత తేలిక అయిపోతానని, ఈ కర్మ పడు తుందనీ నేను అనుకోలేదు' అని అంటూ కొండయ్య బొళు కున ఏడ్చాడు.

'అయితే ఇందాక తలుపు తీశావుకదా క్రిందికి ఎట్లా రా గలిగినావూ !'

గోడలు పట్టుకొని ఎట్లాగో నానా అవస్థా పడ్డాను. గూడలు పీకుతున్నవి. మళ్ళీ అవిఘంగా రానూలేను, వచ్చినా ప్రయోజనమూ ఉండదు. ఎందుకంటే అల్లాగ చచ్చి చెడి వచ్చినా అక్కడ ఒక్క నిమిషంకూడా ఉండలేను. గాలి పైకి ఎగతన్నుతుందాయె' అని కొండయ్య పుట్టెడు దుఃఖాన్ని వెళ్ళబోసుకొన్నాడు.

ఈదభా నాకూ దుఃఖం వచ్చింది ఏమి చేసేది?

మళ్ళీ కుర్చీలో కూర్చుని ఆలోచిస్తూ. ఆ గది అంతా కలయ జూచినాను. పైనా క్రిందా అంతా! పైన దూలానికి ఒకరింగు కనపడ్డది. ఎట్లాగయినా ఆయన క్రిందికి వచ్చే లాగున చెయ్యాలె.

5

ఒక నౌకరును పిలిచి నిచ్చెన ఒకటి తెప్పించి తాడు ఒకటి ఆ రింగులో దూర్చి క్రిందికి వ్రేలాడేశాము. 'ఆ తాడు పట్టుకొని క్రిందికి జారాలి. ఆ తరువాత ఆలోచిద్దాము' అన్నాను.

కొండయ్య బహు కష్టంమీద తాడు పట్టుకొని క్రిందికి రా సాగినాడు. ఎక్కడన్నా కాస్త పట్టు వదిలితే సరి రివ్వున ఎగిరిపోయేవాడు.

నేనూ నౌకరూ కుర్చీలమీదికెక్కి నుంచుని, కొండయ్యను రెక్కపట్టుకొని ఆ తాడు వెంటనే క్రిందికి దిగడానికి సాయ పడ్డాము.

ఎట్లాగయితే నేమి ఆయనను కుర్చీలో కూర్చోబెట్టి చెరో భుజం పట్టుకొని అదిమితే అతడు కుర్చీలో కూర్చో గలిగినాడు. మేము మా చేతులు ఎత్తివేశామా, అతడు రివ్వున గాలి పటములాగ పైకి ఎగిరిపొయ్యేలాగు ఉన్నాడు.

అతనిని కూర్చోబెట్టి భోజనము తినిపించడమెట్లాగో!

ఇంటిప్రక్కనఉన్న ఫ్యాక్టరీలోకి వెళ్ళి రెండు మణుగుల రాళ్ళు తెప్పించి వాటికి త్రాళ్ళుగట్టి ఆ త్రాళ్లు, కొండయ్య చంకల క్రిందుగా పైకి లాగి, భుజాలపైన ముడివేశాము. ఆ బరువు క్రిందికి లాగాతూ ఉండడమువల్ల ఆయనగారు ఎగిరి పోకుండా ఉండడము సాధ్యమైనది.

సరే ఎల్లాగో కూర్చోబెట్టినాము. కాస్త అన్నము తిన్నాడు. ఒక సిగరెట్టుకూడా కాల్చి తృప్తిపడ్డాడు.

కాని భుజాలక్రింద బరువులు కట్టడమువలన ఆయన కేదో బాధ కలిగింది. బుజాలు పీకినవట! ఆ బాధ భరించలేక 'ఇదేమీ బాగుండ లేదబ్బా! నన్నువదిలేశెయ్యండి. ఇంతకంటే ఆపైన అతుక్కొని ఉండడమే సుఖంగా ఉన్నది. బాబోయ్ ఈ బాధ భరించలేను.' అని గోల పెట్టడము సాగించినాడు. సరేనని ఆ త్రాళ్ళు తొలగించేసరికి కొండయ్య దూది పింజ లాగ ఎగిరిపోయి దూలానికి అతుక్కున్నాడు.

గుడ్డిలో మెల్ల ఏమిటీ అంటే ఆ స్థితిలో ఉండే కొండయ్య సిగరెట్టు కాల్చుకునేవాడు.

దాని తరువాత ఏమి చెయ్యాలె అన్నది పెద్ద సమస్య అయిపోయింది. వైద్యులు ఏమీ చేయలేరు. ఈ మళయాళపు మందులకు విరుగుడు అంటూ ఏమీలేదు. ఇదెక్కడి కర్మరా! దిగులుపడి కూర్చున్నాము.

అతణ్ణి అల్లాగ నిరాధారంగా అంతరిక్షంలోనే ఉండ నిచ్చి, ఫలాహారము కాఫీ అందిచ్చాము ఆ మధ్యాహ్నము. కాని ఎన్నాళ్ళని ఇల్లాగ!

అనేకమంది ఆయనతో పని ఉండి వస్తున్నారు. అయితే మేము ఎవ్వరినీ లోపలకు రానీయక ఆయనకు జబ్బుగా ఉన్న దని చెప్పి పంపిస్తూ ఉన్నాము.

ఈ విచిత్ర సంఘటనను గురించి ఇతరులకు ఏమాత్రము తెలియకుండా ఉండాలని మేము శాయశక్తులా ప్రయత్నిం చాము. కాని ఎట్లాగో పాక్కింది కొందరికి ఈ విషయము చూచాయగా తెలిసింది. కొంతమంది డాక్టర్లు వచ్చి 'కొండయ్యకు ఏమిటి జబ్బు! ఎట్లాగున్నది పెద్ద పెద్ద పరీక్షలు ప్యాసు అయిన వాళ్ళము. డాక్టర్లము ఇంతమందిమి ఆయనకు స్నేహితులముగా ఉన్నాముకదా, మాకు సంగతేమిటో చెప్ప రేమి?' అని నిష్ఠురోక్తులు ఆడడము మొదలుపెట్టినారు.

డాక్టర్లతో ఈ విషయము చెపుతానంటే 'వద్దుబాబో వద్దు. వాళ్ళతో చెబితే నేను ఉరిబోసుకు చస్తాను' అన్నాడు కొండయ్య.

నాకు నవ్వొచ్చింది. ఆయన ఉరిబోసుకున్నా చావడు. ఎందుకూ అంటే మనిషి శరీరం బరువై క్రిందికి లాగితేగదా

మెడకు వేసుకొన్న ఉరి బిగియడము. అల్లాగ చావాలన్నా ఆయన చావలేదు. ఆయన చచ్చినట్లు బ్రతికుండక తప్పదు.

ఆయనగారు వద్దు వద్దు అంటూఉన్నా వినక, ఆ డాక్టర్ల అందరిలోనూ, వృద్ధుడూ, సమర్థుడూ, మిక్కిలి యోగ్యుడూ అయినటువంటి ఒకాయనను పిలిచి, 'ఇట్లా వచ్చింది ఏమి చేద్దాం' అన్నాను. అయితే ఆయనను లోపలికి మాత్రము తీసుకొని వెళ్ళలేదు. 'అసలే కొండయ్య సిగ్గుపడి చస్తున్నాడు ఆయనను ప్రత్యక్షంగా చూడవద్దు' అని సవినయంగా డాక్టరుగారికి బోధ పరిచినాను.

ఆయనకూడా తల చేతులలో పెట్టుకొని చాలాసేపు విచారగ్రస్తుడై ఆలోచన చేసినాడు. ఇదేమైనా జబ్బుఅయితే ఆయన ఇంతగా ఆలోచించవలసిన పనిలేక పొయ్యేది! టైఫాయిడ్ జ్వరం అయినా అయితే ఎంతో బాగుండేది! బరువు తగ్గడమూ, మనిషి తేలికఅయి ఎగిరి పోవడమూ, ఎప్పుడూ కనీ, విని, ఎఱుగని విషయము!

ఆలోచించి, ఆలోచించి 'ఈ సంగతి బ్రిటిష్ మెడికల్ కౌన్సిలుకు వ్రాస్తేనో!' అన్నాడు.

అల్లాగ వ్రాస్తే ఇంకేమైనా ఉందా! దేశదేశాలనుంచి వచ్చి పడరూ, ఈ విచిత్రము చూడడానికి!

కొండయ్య నవ్వులపాలై పోతాడు. ఈ విషయం చచ్చినా ఎవ్వరికీ తెలియనీయవద్దని కొండయ్య నన్ను శాసించినాడు.

ఆ డాక్టరుగారు ఏమీ చెయ్యలేక వెళ్ళిపోయినాడు.

కొండయ్య హఠయోగం అభ్యాసంచేసి ఈ విధంగా ఆకాశంలోకి ఎగిరే శక్తిని సంపాదించినాడని కొందరన్నారు. అయితే హఠయోగాభ్యాసంవలన భూమికి జానెడు ఎత్తు పైకి లేవడము ఉండటగాని, ఇల్లాగ ఆకాశంలోకి లేచి పోవడము ఎక్కడా లేదని మళ్ళీ వాళ్ళే అన్నారు.

కొన్ని రోజులనుంచీ కొండయ్య ఏదో క్షుద్ర దేవతను ఆరాధిస్తూ ఉన్నాడనీ, ఆ దేవతను ఉపాసన చేయుడములో ఏదో అకృత్యము జరిగి, తత్ ఫలితంగా ఈ వైపరీత్యం పుట్టిందని కొందరన్నారు.

ఎవరో సిద్ధుడు వచ్చి పాదలేపనము ఇచ్చిపోయినాడని, దానికి ఫలితంగా ఆకాశగమన శక్తి ఆయనకు వచ్చిందనీ, వదిలిపెడితే ఆయన దూర దూర దేశాలకు వెళ్ళి వస్తాడని మరికొందరు అన్నారు

ఇల్లాగ ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా వ్యాఖ్యానము చేసినారు.

కాలం ఏదో విధంగా గడిచిపోతున్నది. కాని రాత్రిళ్లు నిద్రపోవటానికి ఏ మాత్రమూ వీలుపడకుండా వచ్చింది. రెండు మూడు రోజులు నిద్ర లేకుండానే ఉన్నాడు.

మూడోనాడు మాత్రము "బాబూ మీరునాకు నిద్ర పోయే ఏర్పాటు ఏదైనా కల్పించాలి. అల్లాంటి ఉపాయము ఏదో చూడక పోతే నా ప్రాణాలు నిలువవు. ఇక బ్రతకడము కూడా కష్టము" అని గోలపెట్టినాడు

ఆతని మిత్రులమైన మేము ఈ విషయమై గట్టిగా ఆలోచించినాము. ఒక ఏర్పాటు చేసినాము. కొండయ్యను

క్రిందకు లాగి మంచంమీద పడుకోబెట్టి పైన రజాయీలు కప్పి, తాళ్ళతో బిగతీశాము. దానితో కట్టబడి లేవకుండా ఉండి పోవడమే కాకుండా, హాయిగా నిద్రకూడా పోయినాడు.

కొండయ్య ఒప్పుకోవాలెగాని, ఈ దెబ్బతో అతడు ప్రపంచ విఖ్యాతిని సంపాదించుకోగలిగిన స్థితిలోకి వచ్చినాడు. అతని నడుముకు ఒక తాడు గట్టి గాలిపటములాగ ఎగురవేయ వచ్చు. ఆ ఎత్తున వాతావరణస్థితి ఎల్లాగున్నదో అతని ముఖతః తా వినవచ్చు. కాని అతడు అసలే సిగ్గుపడి చస్తూఉంటే! వీటి కన్నిటికి ఎల్లాగ అంగీకరిస్తాడు!

ఆయనను బయటకు తీసుకొనివచ్చి గాలిలో వదిలివేస్తే ఏమిజరుగుతుందో చూడవలసిన విషయమే. గాలిఎటువీస్తే అటు కొట్టుకుపోతాడని తోస్తుంది.

అల్లాగ స్వేచ్ఛగా వదిలేస్తే ఆయన తన గమనాన్ని ఒక నిర్ణీతపథానికి మరలించి, దూరదేశాలు చూచి రాగలుగు తాడేమో! కాని ఈ విషయాలు మా ఆలోచనలే కాని కొండయ్యతో చెప్పడానికి మేము ఎవ్వరమూ సాహసించలేక పోయినాము: చెప్పినా ఆయన ఆమోదించే వాడుకాదు. మేము తనను ఆటవస్తువుగా వాడుకొనడము ఆయనకు ఎల్లాగ ప్రమోదజనకము అవుతుందీ!

ఆ గదిలో గోడలకు గజానికి రెండు గజాలకు ఒకటి చొప్పున పెద్ద పెద్ద మేకులు బిగించినాము. వానిని పట్టుకొని కొండయ్య కాస్త అటూ, ఇటూ, ఆ గోడల వెంటా, దూలాల వెంటా తిరగటానికి వీలు అయింది. దానివలన ఆయనకు కొంచెము సుఖంగా ఉన్నదని చెప్పినాడు.

కొంతకాలము పోయినతరువాత ఆయన రైతులు మొదలైనవారితో మాట్లాడి వ్యవహారాలు పరిష్కారం చేసికోవలసిన అగత్యం కలిగింది. అల్లాగ చెయ్యకపోతే ఎన్నో వ్యవహారాలలో ఆయనకు నష్టం రాక తప్పదు కాబట్టి ఏదో ఏర్పాటుచేసి, యితరులు ఆయనతో మాట్లాడడానికి సదుపాయం చెయ్యాలె

ఆయనను మంచంపైన పడుకోమని కాళ్ళదగ్గర నడుందగ్గర త్రాళ్ళతో మనిషిని మంచానికి కట్టివేశాము. పైన దుప్పటి కప్పినాము. చెమట పోయకుండా పైన ఫాన్ గిఱ్ఱున తిరుగుతునేఉండె! ఆ స్థితిలో ఆయన చూడవలసిన వాళ్ళను చూచి ఎన్నో వ్యవహారాలు పరిష్కారం చేసుకొన్నాడు.

ఎప్పుడూ పడుకొనిఉంటే నరాలుబిగిసిపోతవని మధ్యమధ్య కట్లు విప్పి ఆయనను వదిలేవాళ్ళము ఆ సమయంలో ఆయన పైకి ఎగిరి దూలాన్ని అంటుకొని కాసేపూ, గోడలవెంట పాకి మరికొంతసేపూ కాలక్షేపం చేసేవాడు. తరువాత ఆయనను క్రిందికి లాగి త్రాళ్ళతో బిగించి పైన సన్నని దుప్పటి కప్పి పడుకోబెట్టేవాళ్ళము.

కొన్ని నెలలు గడిచిపోయినవి. కొండయ్యకు ఈజీవితం ఒక విధంగా అలవాటు అయింది. కాని ఎన్నాళ్ళని ఇల్లాగ! మళ్ళీ యథాప్రకారం వీధిలోకి వెళ్ళి తిరగడము ఎప్పుడూ!

ఆలోచిస్తే దానికీ ఒక ఉపాయం తోచింది ఎంత బరువు అతని శరీరంపైన ఉంటే అతడు భూమిని అంటిపెట్టుకొని ఉంటాడు, పైకి ఎగురకుండా! ఈ సమస్యను పరిష్కారం చేస్తే కొండయ్య మామూలుగా తిరుగవచ్చు.

ఒకరోజున ఆయనను భూమిమీద నిలువబెట్టి, కోటు అపి తొడిగి, ఆయన జేబుల్లో ఇటుపక్కన ఒక వీసె రాయి, అటుపక్కన ఒక వీసెరాయి వేశాము. మనిషి నిలబడి పోయి నాడు ఎగిరిపోలేదు అహా ఇదిరా ఉపాయం అనుకున్నాము.

కొండయ్య మామూలుగా దుస్తులు వేసుకొని కోటు జేబులలో ఈ రాళ్ళు వేసుకొనేదాకా పట్టుకొంటే ఆ తరువాత అతడు మామూలుగా అందరిలాగే నడిచి వెళ్ళగలిగే వాడు. కాని అంతవరకు అతనిని ఇద్దరు ముగ్గురు అదిమి పట్టుకోవాలి

దాని తరువాత మరొక ఉపాయం తోచడమువలన అల్లాగే మనిషిని అదిమి పట్టుకోవలసిన అవసరంకూడా పోయింది.

అడుగున, సుమారు వీసె బరువుగల సీసపు రేకులను బిగించిన ఒక క్రొత్తరకపు బూడ్సులు తయారుచేసి అవి తొడుక్కోమన్నాము. ఆబరువుకు అతడు భూమిమీదనుంచి లేవడము మానేశాడు. అందరివలెనే నడచి, వ్యవహారాలు చక్కబెట్టుకో గలిగినాడు దానితో మాకు అతనివిషయమై వచ్చిన సమస్య తీరిపోయింది.

అల్లాగ తయారుచేసిన బూడ్సులు రెండుజతలుఉన్నవి. హాయిగా కాలం గడిచిపోతున్నది

కొన్నాళ్ళు పోయినతరువాత సరదాకు, ఇంకొకరకము జత తయారు చేయించినాము. ఆ బూడ్సులలో ఒక్కొక్క దాని అడుగున అరవీసె బరువుగల సీసముమాత్రమే ఉంటుంది. ఈ బూట్సు వేసుకొన్నప్పుడు అతడు భూమిమీద నిలువబడి,

నిలువబడనట్లు ఉంటాడు. బరువూ, వత్తిడీ ఏమాత్రమూ భూమిపైన పడదు. ఈ పాదరక్షలు తొడుక్కొని అతడు పరుగెత్తగలడు. అల్లాగ పరుగెత్తుతూ ఉన్నప్పుడు ఆయన కాళ్ళు భూమిపైన ఆనీ, ఆనకుండా ఉంటవి. బహు సునాయాసంగా, వేగంగా పరుగెత్తగలడు. అంత స్థూలకాయుడు అంత సునాయాసంగా పరుగెత్త గలిగి ఉండడము బహు విచిత్రమైన విషయం కదా!

కొండయ్య ఇప్పుడు సుఖంగానూ నిర్విచారంగానూ జీవించగలుగుతున్నాడు. ఒకసారి ఒకమైలు పరుగుపందెంలో అతడు ప్రధముడుగా రావడము ప్రపంచాన్ని అంతా విస్మయ సంభ్రమములతో ముంచెత్తి వేసింది.

కాలం గడిచినకొద్దీ అతడు తన నూతనజీవితాన్ని మరీ సుఖవంతము, విలాస పరిఫుల్లమూ అయ్యేలాగున చేసుకొంటున్నాడు.

—o—